# శివరాత్రి మహోత్సవం

పురాణం సుబ్రహ్మణ్యశర్మ

అనగనగా ఓ లేడీడాక్టరు. మేం డి.బి.కె. రైల్వేలో పనిచేసే రోజుల్లో అరవిందముఖి అని ఓ లేడీడాక్టరుండేది.

లేడీడాక్టర్ రాకముందు లేడీడాక్టర్ని మా వూరు వేస్తున్నారంటే మా కేంపు కేంపంతా సరదా పడిపోయింది. ఆ లేడీడాక్టరు అవివాహిత అని తెలిశాక మా రైల్వే స్టాఫ్ అంతా మగాళ్ళుకూడా ఆవిడ దగ్గర వురుడు పోసుకోడానికి పరమ సంబర పడిపోయారు. ఆఫీసర్లుకూడా 'అరవిందముఖి' రాకకోసం మలయాళపు శృంగార సినిమాకై కుర్రకారు ఎగబడినట్లు తెగ ఉత్సాహ పడిపోయారు.

ఆవిడకు రోగుల్ని చూడ్డానికి, కేంపులలో వున్న సిబ్బందిని పరామర్శించడానికి ఇంజనీర్ల జీపుల్ని వాడుకోవచ్చు. అంచాత ఆ డాక్టరమ్మగారిని పక్కన కూచోబెట్టుకుని బండిని తోలడానికి ప్రతి జీపు డ్రయివరూ రంభనెత్తుకుని రన్నింగ్ రేసులోకి దిగినట్లు ఫీలయ్యేవాడు. తెరమీది సాని దిగివచ్చి దిగివచ్చి కితకితలు పెట్టినట్లు జీపు డ్రయివర్లు మెలిదిరిగి పోయేవారు. ఆడగాలి మహిమ అలాంటిది.


పులులకి, సింహాలకి పడనట్టే డాక్టర్లకి, ఇంజనీర్లకికూడా పడదు. అరవింద మంచి లేడీడాక్టరు కావడంవలన (అసిస్టెంట్ సర్జన్లకు అసిస్టెంటు మెడికలాఫీసర్‌హోదా అప్పటికి రాలేదు. అంటే గెజిటెడాఫీసరు కాలేదు. కనుక వాళ్ళ టి.ఎ. బిల్లులు, ఇంజనీర్లు కవుంటర్ సైన్ చెయ్యాలి) కొంత సర్దుకుపోయినా ఆడగాలి వేరు, కొండగాలి వేరు. దేనికది వేరేకదా!

ఇంతలో ఓ వింత - కాబోయే పేషెంట్ల ఆశలన్నీ, ఆవిడ కుప్పకూల్చేసింది. చాలా మంది ఆవిడ తన కంకణాలచేత్తో చెయి చూస్తుందనీ, జ్వరంవస్తే పొట్టమీద చేయివేసి పరామర్శిస్తుందనీ, మెడమీద తలమీద రాస్తుందనీ, అలాగే ఆ కోమలమైన హస్తంతో ఇంజక్షనిస్తుందనీ ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

కాని, ఆవిడ జగత్కంత్రీ అని విలాసార్థం నలకూబరుడు లేకుండా ఆ లోయల్లో విహారానికి వచ్చిన రంభ అనీ, టి.ఏ. బిల్లుల కోసం, ఆదివారాలు రెండవ శనివారాలు హాలిడేస్‌లో వాల్తేరు చెక్కేసి 'కజిన్స్'తో కాలక్షేపం చేయడానికే వచ్చిన కాంతకాని, రోగార్తుల ఆశ నిరాశలతో ఆమెకేమీ నిమిత్తం లేదని అప్పుడు ఆ వూళ్ళో చాలా మందికి తెలీదు.

డాక్టర్ అరవిందముఖి తెల్లబాతులా డ్రెస్సప్పయి శివునిమెళ్ళో పడగ విప్పిన నాగసర్పంలా స్టెత్‌ని మెళ్లో వేసుకుని దాన్నే తిప్పుతూ, నలుపుతూ పేషెంట్లు చెప్పినది వినీ విననట్లు తన వాలుకనులతో అటూ, యిటూ చూసి నచ్చినవాడు వల్లుఖైనా వాడి ప్రాణాలు తోడేసేది. చెయిచూడ్డం, ఇంజక్షనివ్వడం, మందులు తాగించడం వగైరాలు కంపవుండరు గోపాలరావుచేత చేయించేది. చిన్నచిన్న గాయాలు తగిలినా అన్నిటికీ గోపాలరావే. అఖరికి నోట్లో గుచ్చిన ధర్మామీటరును కూడా కంపవుండరేచూసి చెప్పాలి. ఆవిడ చూపులు ధర్మామీటరు మీదకూడా వాలేవి కావు.

ఇక పెద్దవాళ్ళ విషయానికివస్తే, ఆవిడ చాలా ఓర్పుగా 'మీరు డి.యం.వో. గారిని చూస్తే మంచిది. సి.యం.వో. గారిని చూస్తే మంచిది -' అని కేసులన్నీ పైకి రిఫర్‌చేసి తప్పించుకునేది. అయితే ఆఫీసర్స్ క్లబ్బులో మాత్రం దబ్బెట్టి పేకాడేసి కుర్రఇంజనీర్ల నుంచి లాగవలసినంతసొమ్ము లాగేసేది. ఆవిడకోసం టవున్నుంచి 'కజిన్స్' వస్తూ వుండేవారు. వారికోసం రమ్మూ, జిన్నూ, బ్రాందీ, విస్కీ సీసాల్ను స్టోర్ చేసేది. మాంసాహారం వండ నేర్పుగల 'ఆయాని' కేసులో చేర్చుకుంది. అలా ఆవిడకు ప్రతి రాత్రి వసంతరాత్రి కాకపోయినా అన్ని రాత్రులూ చీకటి రాత్రులు కావు. ఇలా, కతిపయ దినంబులు గడచినంత - నాకూ ఆవిడకూ భేటీ పడింది.



గవర్నమెంటులో పని చేసే వారికి తెలుస్తుంది. అక్కడ రూల్సు ముఖ్యంకాని మరేమీ కాదు. ఇంజనీర్లకి డాక్టర్లకీ తాము టెక్నికల్

మనుషులమని తమకు రూల్సు వర్తించవని గర్వం. అప్పుడప్పుడు ఇంజనీర్ల జీపులు దొరకనప్పుడు-లేడీడాక్టర్ యిష్టమున్నా లేక పోయినా బస్సెక్కవలసి వచ్చేది. ఢిల్లీకి, న్యూయార్క్‌కి మధ్య లంకలా ఆ వూరుకీ విశాఖపట్నానికీ మధ్య శృంగవరపుకోట అలాటిది. పెద్ద షాపింగ్‌లకి పొత్తేరు కెళ్ళినా- చిన్న చిన్న షాపింగ్‌లకు శృంగవరపుకోటే శరణ్యం. హోటళ్ళున్నాయి. ఒకటో ఆరో సినిమాహాళ్ళున్నాయి. మా లారీడ్రయివర్లూ, జీప్ డ్రయివర్లూ కులాసా చెయ్యడానికి ఇక్కడ చిల్లర సదుపాయాలు కూడా వున్నాయి. డ్రయివర్లు ఎక్కడ నిద్రతీశారో చెప్పడానికి క్లీనర్లుండేవారు. డ్రయివర్లు వది లేసిన కాతాల్ని క్లీనర్లు లాగిస్తూ కేసులు చెడి పోకుండా చూసుకునేవారు.

* * *

అరవిందముఖి యింటికెవరేనా వెళితే విసుక్కునేది, తిట్టేది. ఆసుపత్రిలో వుందో లేదో తెలిసేదికాదు. ఇల్లా వెళ్ళేసరికి అల్లా మాయమయేది. ఆవిడ పొట్టి కాదు, కాస్త పొడగరి. తెలుపే. ముఖం వెడల్పే-కళ్ళు కాస్త చిన్నవి. మనిషి హోదావల్ల వచ్చిన దర్జాతో మెరిసేది. ఆ కాలనీలో కుటుంబాలతో వున్నవాళ్ళు కొద్దిమందే. ఒక విశేషం ఏమిటంటే - కేంపుల్నించి వచ్చాక 'అమ్మగారు కూరవుంటే పెట్టమన్నారు, పచ్చడి వుంటే పెట్టమన్నారు' అని కళాసీని గిన్నె యిచ్చి పంపేది. ఆడవాళ్ళు తాము యింట్లో యేది చేసుకున్నా డాక్టరమ్మకి పంపించేవారు. కాని, ఆ మొహమాటం ఏమీ లేకుండా ఇంటికి వచ్చినప్పుడు ఖచ్చితంగా 'ఐదూ, పది' విజిటింగ్ ఫీజు వసూలు చేసేది. ఇలా వుంటూం డగా -ఆవిడగారు కాంపుకి లైనుమీద వెళ్ళేసి నపుడు కంపవుండరు గోపాలరావు మా ఆవిడ కబురుచేస్తే 'డెట్టాల్' యివ్వడానికి బదులు 'లైజాల్' యిచ్చాడు. ఏడాదికూడా నిండని మా చంటిపిల్లాడికి అది డెట్టాల్ అనుకుని - కాళ్ళమీద పడుకోబెట్టుకుని నోట్లో పోసేసింది. దాంతో పిల్లాడు నోరంతా కాలి, బోరంతా కాలి గుక్కపట్టి యేడ్చేస్తున్నాడు. తరవాత కనుక్కుంటే తెలిసింది. లైజాల్ పాయిజన్‌లాటిదని. పిల్లాడు గిలగిల కొట్టుకుంటున్నాడు. చూడ్డానికి వచ్చిన వాళ్ళంతా యీ పిల్లాడు యిలా అరిచరిచి చచ్చిపోతాడు. అని అన్నారు. ఉప్పునీళ్ళు నోట్లో పోశాము. నాకూ మా ఆవిడకూ కాలూ చేయీ ఆడలేదు. ఆవిడ ఏడ్చేస్తోంది. పిల్లాడి అవస్థచూసి నేను వెర్రిమొహం వేసుకుని నిలబడ్డాను. కంపవుండరుచేత మందులిప్పిస్తే ఎలా కొంపముని గిందో చూశారా అని అంతా చివాట్లు వేస్తున్నారు. ఓ రాత్రివేళ డాక్టరమ్మ వచ్చిందని తెలిసి కబురుచేస్తే 'లెట్ హిమ్‌డై. నన్ను డిస్టర్బ్ చెయ్యొద్దు' అని అందిట. ఆ మనిషి ఎటువంటి శాడిస్టో అనుకున్నాం, విచారించాం. పిల్లాడి యేడుపు ఆగిందికాదు. 'ఇలా ఏడిచి ఏడిచి మన కళ్ళముందు ప్రాణాలు విడుస్తాడు వీడు' అని భయపడుతున్నాం. ఇంతలో మా ఆవిడ తలారా స్నానంచేసి వెంకటేశ్వరునికి ముడుపుకట్టి నీ కొండకు వస్తానని మొక్కుకుంది. ఇంట్లో చాపమీద చెరోవైపూ పడుకుని మధ్యన ఏడుస్తున్న పిల్లవాడ్ని పెట్టుకుని దీనాతిదీనంగా అయిపోయి ఒరిగాం. వాడు ఏడుస్తూనే వున్నాడు మేం నిద్రపోయాం. అంత దుఃఖంలో ఎలా నిద్రపట్టిందో మాకైతే తెలీదుకాని మేం మళ్ళీ లేచేసరికి పిల్లాడు మా యిద్దరిమధ్యా కూచుని నవ్వుతూ కేకలేస్తూ ఆడుకుంటున్నాడు. మాకు చెప్పలేనంత ఆనందం కలిగింది. పిల్లాడ్ని ఎత్తుకుని యింటింటికీ వెళ్ళి నిద్రలేపి మావాణ్ని చూపించి వెర్రాళ్ళలా సంతోషపడిపోయాం. పిల్లాడు వాడికేమీ జరగనట్లే వున్నాడు. బోర



నోరు అంతా కాలిపోయి మచ్చలు కట్టినా, అది నిస్సందేహంగా ఏడుకొండలవాడి మహిమేనని మాకు స్పష్టంగా నెత్తిమీద కొట్టి చెప్పినట్లు తెలిసిపోయింది. ఆఫీసులో రిపోర్టు యిచ్చాను. కంపవుండరు గోపాలరావుని ఏమీ అనొద్దని పెద్ద ఆఫీసర్‌కి చెప్పి వచ్చాను. కాని 'లెట్ హిమ్ డై' అన్న ఆ లేడీడాక్టర్ 'అరవిందముఖి' మీద నా కోపం పోలేదు. ఇంతచిన్న వయసులో మానవత్వపు విలువలు




మృగ్యమయిన యీ ఆడది ఎదిగితే ఎంతపెద్ద విషవృక్షమవుతుందోకదా-ఎంతమందిని కాటేసే విషవృక్షమవుతుందోకదా? ఎంత మందిని కాటేసే కాలసర్పంలా మారుతుందో కదా ? అని విచారించాను. మా కాలనీ కాలనీ అంతా ఆ 'అరవిందముఖిని' డ్రాకులాని చూసినట్టు చూసేవారు. కాని ఆమెను ఎవరూ ఏమీ చేయలేకపోయారు.


* * *

అసలుజీతం బ్యాంకులో వేసుకుని టి.ఏ. బిల్సు వగైరాలమీద చాలామంది బతికేస్తూ వుంటారు. అరవిందముఖి బిల్సు, పేబిల్సు, ప్యాసులు అన్నీ నేను చూస్తూ వుండేవాడిని. ఆవిడ టి.ఏ. బిల్సు అన్నీ తప్పుల తడకలు. జీపుల లాగ్‌బుక్స్‌తో కంపేరుచేస్తే చాలా తప్పులు వుండేవి. అలాటి బిల్సు పాస్‌చేస్తే ఆడిట్‌వాళ్ళు పట్టుకుని పిలక జాడించేస్తారు.

బస్సులు చెడిపోయి వారాల తరబడి నడవకపోయినా - ఆ బస్సులలో తను వెళ్ళినట్లు పాత బస్సు టిక్కెట్లమీద తేదీలు దిద్ది బిల్లులు పెట్టేది.

గుమాస్తా తెలివితేటలన్నీ వుపయోగించి ఒక పెద్ద నోట్ తయారుచేసి పెద్ద ఆఫీసర్‌కి పంపాను. ఆవిడ బిల్సు అన్నీ రిటన్ చేశాను.

ఉరుము ఉరిమి మంగలంమీద పడ్డట్లు ఆఫీసరు పిల్చి నామీద విసుక్కున్నాడు. ఆ బిల్సు అన్నీ ఎలా రాయాలో నీకు తెల్సు కాబట్టి నువ్వే ఎలారాయాలో చెప్పి అలా



రాయకపోయావా ? లేడీడాక్టర్‌కి మీ ఎస్టాబ్లిష్ మెంటు రూల్సన్నీ ఎలా తెలుస్తాయి. అని నన్ను దబాయించాడు. నా దస్తూరితో నేను రాయకూడదు, రాయనన్నాను.

ఇది జరిగాక కొన్నాళ్ళకి నాకు హెడ్డాఫీస్‌కి వాత్తేరు ట్రాన్స్‌ఫరయింది. తంతే బూర్లె గంపలో పడ్డట్టు కోరుకున్న విశాఖపట్నం వచ్చాను. లైనులో వుండేవారికి ఎంత ఐతి మాలినా విశాఖపట్నం యిచ్చేవారుకాదు. అల్లాటిది నాకు పిలిచి వాత్తేరివ్వడం నా అదృష్టం అనుకున్నాను.

నాకు పెద్ద సెండాఫ్ పార్టీ యిచ్చారు. నా గురించి ఆఫీసర్లుకూడా పొగిడారు. నేను వెళ్ళిపోతే అక్కడ పెద్ద వెలితి ఏర్పడుతుందన్నారు. నా సహోద్యోగులు నా గురించి మాట్లాడుతూంటే- నాకు ఓచెంప అనుమానం కలిగింది. అది నా సంతాపసభా, నావీడ్కోలు సభా అని అనుమానం వచ్చింది. నేను కుర్చీలో కూర్చుండగానే నా గురించి భూత కల త్రైరిమలతో నా సుగుణాల్ని వర్ణిస్తూంటే నాకు నవ్వువచ్చింది.

నా హయాంలో మంచి లైబ్రరీ, ఒక స్పోర్ట్స్ క్లబ్ పెట్టించాను. కోపరేటివ్ స్టోర్స్ పెట్టించాను. నాటకాలు వేయించాను. ఉత్సవాలు జరిపించాను. ఇందుగలడందులేడని ప్రహ్లాదుడు చెప్పినట్లు అన్నిట్లో వున్నాను. నా ఉద్యోగంకంటె నేను చాలా ఎత్తున వున్నాను. అయితే నా పలుకుబడి, నాకుగల సంబంధాలు అట్లాంటివి. అయినా నాకు ప్రథమకోపం జాస్తి. కోపము వలన ఘనత కొంచెమైపోవును అన్నారు పెద్దలు. అలా నా ఘనత కొంచెమైపోవడానికి నేనే కారకుణ్ని. ఎవర్నయినా తిడితే ఆ కోపంకాస్తా జారిపోయాక నిస్సంకోచంగా 'అపాలజీ' చెప్పేవాడ్ని.

మా ఆఫీస్‌లో గోవర్ధన్ అని ఓ అటెండరు (అస్పామీ) వుండేవాడు, అతనితో దోస్తీ. అతను నాకు బాడీగార్డు. మంచికుక్ ఉత్తరాది మిఠాయిలు అతనిచేత చేయిస్తూ వుండేవాళ్ళం పండగలకి. రవ్వకేసరి బాగా చేసేవాడు. అతను నాకు ఫ్యామిలీ క్వార్టర్స్‌లో తనఇంట్లో పార్టీయిచ్చాడు. ఆవేళ పూరీలు ఆబేజీ బఠాణీలకూర, పాలక్‌భాజీ, తోటకూరతో బజ్జీలు ఏవో చాలా చేశాడు. నాతోపాటు కొంతమంది స్నేహితులుకూడా గోవర్ధన్ యింటికి విందుకు వచ్చారు.

అయితే ఆరోజు మహాశివరాత్రి.

గంజాయి, బాదంపప్పు, ఇలాచీ యింకా ఏవో మసాలాలు తెచ్చి ఒక పచ్చని ముద్ద నూరాడు మా గోవర్ధన్. అంతకుముందు నేనెన్నడూ ఎటువంటి మాదక ద్రవ్యాలూ, మత్తు సామానూ తీసుకుని ఎరగను. పైగా అవి తీసుకునేవారికి నీతిపాఠాలు జోరుగా చెబుతూ వుండేవాడిని. దగ్గు, ఆయాసం వస్తోందని సిగరెట్టుకూడా మానేసాను. అంచేత మా గోవర్ధన్ 'భంగు' దానిని పాలలో కలిపిఇస్తూ వుంటే 'యిది ఎలా వుంటుంది' అని అడిగాను. అతనన్నాడుగదా 'సగ్గుబియ్యం పరవాణ్ణంలా వుంటుంది గురూజీ' అన్నాడు. లస్సీ గ్లాసుడు తాగి ఆకుపచ్చ పరవాణ్ణం నెమ్మదిగా తాగాను. 'అవును అతను అబద్ధం చెప్పలేదు. అచ్చం పరవాణ్ణంలాగే వుంది మధురాతిమధురంగా.' ఒకటి, రెండు, మూడు - మూడు లస్సీగ్లాసులు తాగాను. రవ్వకేసరి, పూరీలు కూర, బజ్జీలు, యింకా ఏవో మిఠాయిలు 'జై బోలో భజరంగబలీకి. జై పశుపతి నాథ్! నమఃపార్వతీపతయే న్నమః' అని మహాశివుని కీర్తిస్తూ తిన్నా.

అయితే భంగు తాచుపాములా సర్రన ఎక్కిందుట.

'చుక్కలు తిరిగే హిమాద్రిపై
ఆకసము చేసే గౌరీశా -
విన్నావయ్యా నా మనవొక్కటి
విన్నవించెద గౌరీశా -'

అని చింతాదీక్షితులగారి శివరాత్రి కవిత అలపించాను, వాళ్ళంతా భజన ప్రారంభించారు. నాకు నిద్ర వస్తున్నదంటే - గోవర్ధన్ నన్ను యింటివద్ద దిగబెట్టాడు. వెళ్ళి పడుకున్నాను. ఆ పడుకోవడం మూడురోజులకు నిద్రలేచాను. నా స్నేహితులంతా నాకెల్లా వుందని చూడ్డానికి వచ్చి కిటికీలదగ్గర తొంగిచూసినపుడల్లా మా ఆవిడ 'ఆయన్నిలా చేస్తారా' అని కాళ్ళను జాడించేదిట. నా అవస్థ ఎలా వుందంటే ఆ మూడ్రోజులూ నేను మంచాన్ని అంటిపెట్టుకుని లేవలేకపోతున్నానుగాని నాకన్నివిషయాలూ, మాటలూ తెలుస్తున్నాయి. వినిపిస్తున్నాయి. నా మెదడు సహస్ర ఖండాలుగా విడిపోయి దేనికది ఇండిపెండెంటుగా ఆలోచిస్తున్నది.

మా ఆవిడ ఉప్మాచేసి ప్లేటులోపెట్టి నన్ను తినమని చెప్పింది. అప్పుడు నేనన్నాను, స్టూలుమీదవున్న వుప్మా నా దగ్గరకు రావాలి రావట్లేదేమని.

'స్నేహితులు, స్నేహితులంటారు. ఆ స్నేహితులే మిమ్మల్నిట్లా చేశారు' అని మా ఆవిడ కళ్ళనీళ్ళు పెట్టుకుంది. నేనిలా అయిపోయాననే బాధకుతోడు యిది అందరికీ తెలిసిపోయిందే అని ఆవిడ ఎక్కువ బాధపడింది. డాక్టర్ అరవిందముఖికూడా నన్ను చూడ్డానికి పనిగట్టుకు వచ్చిందని నాకు తెలుస్తోంది.

'ఒళ్ళు పొగరు. తిక్క బాగా కుదిరిందని కొంతమందిఆనందించారట.'

అయితే నాతో భంగు స్వీకరించిన మిగతా వాళ్ళంతాకూడా కొన్ని 'శివలీలలు' చూపెట్టారట.

ఒకతను రైల్వేక్లబ్బుకివెళ్ళి తెల్లార్లూ క్యారమ్స్ ఆడుతూ కూచున్నాట్ట.

ఇంకొకతను గుమ్మంలోంచి యింట్లోకి రాకుండా కిటికీలోంచి లోపలకు రావటానికి ఆదేపనిగా ట్రయి చేశాడట.

మరొకతను కోటేసుకుని వాళ్ళింటి



గుమ్మంలో నిలబడి తనొక టికెట్ కలెక్టర్నను కొని 'టికెట్ టికెట్ ప్లీజ్' అంటూ నిలబడిపోయాట్ట.

శివరాత్రి మహత్యం యిలా జరిగాక నేను గప్‌చిప్‌గా తెల్లారగట్టలేచి లారీఎక్కి వైజాగ్ వెళ్ళిపోయాను. అక్కడ పెద్దాఫీసులో నాకు కొన్ని విషయాలు తెలిసాయి.

డాక్టర్ అరవిందముఖి షెడ్యూల్‌కాస్ట్ సర్టిఫికెట్‌తో మెడికల్ కాలేజీలో సీటు సంపాయించిందికానీ ఆవిడది పెద్దకులమేననీ, డేట్ ఎక్స్‌పయిర్ అయిన పాస్‌తో మళ్ళీమళ్ళీ ప్రయాణం చేస్తూ చెకింగ్ స్క్వాడ్ గారికి దొరికిపోయిందనీ, ఆ కేసులన్నీ మళ్ళీ నా దగ్గరకే వచ్చాయి, భూమి గుండ్రం అన్నట్లు

ఆ కేసులన్నీ నేను చదివాను.

అపుడు నాకు తెలిసిందేమిటంటే - లేడీ డాక్టర్ని పనిగట్టుకు అల్లరి పెడుతున్నానని నన్ను వాత్తేరు ట్రాన్స్‌ఫర్ చేయించింది 'అరవిందముఖే' నని.

అప్పుడు మా ఆవిడ అంది 'ఆడవాళ్ళతో తగూ పెట్టుకోకండి. ఓడినా గెలిచినా మీకే అవమానం' అని.

మీరేమంటారు ?